శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## 2024లో జగనన్నను ఆశీర్వదించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు



**అనంతసాగరం, జులై9ప్రభాతవార్త:** మండలంలోని పాతదేవరాయపల్లి బిట్-1 పరిధిలోని పాతదేవరాయపల్లి, ముత్తుకూరు గ్రామాల్లో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లోని పలు కాలనీల్లో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి పర్యటించారు. ఈసందర్భంగా ఆయన ఆయా కాలనీలో పర్యటిస్తూ ముఖ్యమంత్రి పేదలకు అందజేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ వారి కుటుంబానికి ప్రభుత్వం ద్వారా మంజూరైన సంక్షేమ పథకాల లబ్ధిని తెలిపే కరపత్రాలను అందజేశారు. ఈ పర్యటనలో ఓ దివ్యాయంగులు తన సమస్యను తెలియజేయడంతో వెంటనే జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని, ప్రతి ఒక్కరి సంక్షేమాన్ని ఆయన బాధ్యతగా తీసుకున్నారన్నారు. సచివాలయం, వాలంటీర్ వ్యవస్థల ఏర్పాటుతో గ్రామీణప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఏమైనా సమస్యలుంటే వాలంటీర్ ద్వారా యాప్ లో నమోదు చేసుకోవాలని దీని ద్వారా వారి సమస్య ఉన్నతాధికారులకు తెలిసి పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రభుత్వం అధికారులతోపాటు తమ కార్యాలయం కూడా ప్రజలకు సేవలు అందించేందుకు సిద్ధంగా ఉంటుందని , ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చని సూచించారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారంపై ప్రత్యేక ప్రణాళికతో సమిష్టిగా కారా ్యచరణ రూపంఇంచుకొని పనిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపిపి పెయ్యల సంపూర్ణ, మండల సచివాలయాల కోఆర్డినేటర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## కొత్తకోడూరు బీచ్‌లో శాంతి భద్రతల పర్యవేక్షణ



**తోటపల్లిగూడూరు, జూలై 9,ప్రభాత వార్త** మండల పోలీసు స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ జంపాని కుమార్ ఆదివారం జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఆదేశాల ప్రకారం కోడూరు బీచ్ ప్రాంతంలో తన సిబ్బందితో శాంతి భద్రతల పర్యవేక్షణ చేపట్టారు. బీచ్‌ను ఇక్కడ వేళాంగిణి మాత ఆలయం సందర్శించే సందర్శకులకు పలు సూచనలు చేశారు. ప్రధానంగా సముద్ర స్నానం చేసేవారు లోతుకు వెళ్లకుండా, తాము నిర్దేశించిన ప్రదేశంలో మాత్రమే వెళ్లి స్నానాలు చేసుకోవాలన్నారు. స్థానిక మత్స్యకారుల సూచనలు, సలహాలు తీసుకోవడం జరిగిందన్నారు. చాలా చోట్ల గుంటలు, సుడిగుండాలు ఉండటంతో సందర్శకులు పోలీసు సూచనలు తప్పక పాటించాలన్నారు. ఈ ప్రాంతంలో డ్రంక్ అండ్‌డ్రైవ్ నిర్వహించి ఎలాంటి అసాంఘిక సంఘటనలకు తావు లేకుండా తాను తమ సిబ్బంది పర్యవేక్షిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పర్యాటకులు, సందర్శకులు తమ సూచనలను పాటించి ప్రమాదాల నివారణకు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్‌తో పాటు సిబ్బంది ఉన్నారు.

## జగన్ డబుల్ ఎర్రిపుష్పం



**నెల్లూరు జూలై 9, ప్రభాతవార్త-వైద్యం** లోకేష్‌ని ఎర్రిపుష్పం అని అనిల్‌కుమార్‌యావ్ అంటున్నాడని, మీ నాయకుడు జగనే డబుల్ ఎర్రిపుష్పం అని మేము కూడా అనగలమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి దుయ్యబట్టారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి మాట్లాడారు. నగర ఎమ్మెల్యే అనిల్ దేవాలయంలో ప్రమాణం చేసే సమయంలో మంది మార్భలాన్ని తీసుకొచ్చి దేవాలయాన్ని అపవిత్రం చేశాడని విమర్శిం చాడు. ప్రమాణాల పేరుతో దేవాలయాల్లో కుర్చీలు వేసి, రాజకీయ సమావేశాలను ఎలా పెడతారని ఆయన ప్రశ్నించారు. దేవుడు వెనుక ఉంటే అనిల్ వెనుకకు తిరిగి ప్రమాణం చేయడం ఏమిటని ప్రశ్నించారు. రాజకీయాలకు దేవాలయాలను వాడుకోవడం ఏమిటని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అవినీతి అక్రమాలపై ప్రమాణం చేస్తే సచ్ఛీలుడివి అయిపోతావాని ఏద్దేవా చేశారు. ఇలాంటి ప్రమాణాలతో ప్రజలను మభ్యపెట్టలేవని, భక్తులు దేవుళ్ళపై నమ్మకాన్ని కోల్పోతున్నారని మండిపడ్డారు. నీ బినామీ అయిన చిరంజీవి ఇంటికి ఒక కార్యక్రమానికి నువ్వు హాజరు కాలేదాని, చిరంజీవి పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకున్న పత్రాల్లో సాక్షి సంతకం చేసింది నీ పిఏ నాగరాజు కాదాని, నువ్వు చిరంజీవికి సంబందించిన పెళ్ళికి కూడా వెళ్ళివని ఆరోపిస్తూ దానికి సంబంధించిన ఫోటోలు, డాక్యుమెంట్లను మీడి యాకి చూపించారు. నువ్వు గుడిలో చేసిన ప్రమాణం పచ్చి అబద్ధం కాదాని ప్రశ్నించాడు. అనిల్ చిన్నప్పుడు ఒక కూల్‌డ్రింక్‌షాపులో కూర్చునేవాడని, ఫాలింగ్ సీలింగ్ చేసుకునే వ్యక్తి పేరు మీద నీబినామీతో కలిసి ఆయన పేరుతో రిజిస్ట్రేషన్ చేసింది నువ్వేనని డాక్టుమెంట్లు రుజువు చేస్తున్నాయని ఆనం అన్నారు. ఆగస్టు 23, 2017లో నెల్లూరు పోలీసులు నిన్ను ఐపీఎల్ బెట్టింగ్‌పై విచారణకు పిలిస్తే, అక్కడ దానితో నాకు సంబంధంలేదన్నావని, నిన్న కాక మొన్న ఒక కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ దానితో మా బాబాయికి సంబంధం అని అన్నావాని, అది కూడా నిజం కాదన్నారు. సౌత్ ఆఫ్రికాలో దొంగ బంగారుపై నీ ఇంటికి నోటీసులు రావడం నిజం కాదాన్నారు. నీ ప్రమాణాలతో నీకు కుటుంబసభ్యులకు ప్రమాదమని, దేవుడు అనిల్ చేసిన ప్రమాణానికి ఆయన తరపున నేను క్షమాపణ కోరుతున్నానన్నారు. అనిల్ ఎక్కడైనా చిన్న ప్రారంభం చేసినా హంగామా చేసే అనిల్ నిన్న రామలింగాపురం ఫ్లైఓవర్ బ్రిడ్జిని నామమాత్రంగా ప్రారంభించాడని, అందుకు ప్రధాన కారణం అది బ్రిడ్జి కేంద్ర నిధులతో పూర్తి చేయబడిందన్నారు.

## దొంగతనంగా డ్రోన్ కెమెరాలతో ఫోటోలు తీసి అసత్య ప్రచారాలు చేయడం తగదు



**బిట్రగుంట, జులై 9 ప్రభాతవార్త** కావలి నియో జకవర్గంలో గత రెండు రోజుల నుండి టిడిపి నేత నారా లోకేష్ యువగళం పాదయాత్ర విజ యవంతంగా జరుగుతుంటే దొంగతనంగా డ్రోన్ కెమెరాలతో ఫోటోలు తీసి పాదయాత్ర పూర్తిగా అట్టర్ ఫెయిల్ అయిందని వైసిపి నేతలు విమ ర్శించడంపై కావలి టిడిపి నియోజకవర్గ ఇన్ చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు ఆగ్రహం వ్య క్తం చేశారు. బోగోలు మండలం బంగారుపాళెం యువగళం క్యాంప్ సైట్‌లో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో చిత్తూరు జిల్లా కుప్పంలో ప్రారంభమైన నారా లోకేష్ యువగళం పాదయాత్రకు అపూర్వ స్పందన వస్తుంటే కావలి నియోజకవర్గంలో ఎవరో వెదవ డ్రోన్ కెమెరా పెట్టి చూపించి జనంలేక వెలవెలపోయిందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బీద రవిచంద్రపై, సుబ్బానాయుడుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారని రాయడం బాధాకరమన్నారు. రాసే వారికి, చూసే వారికి కళ్లు వున్నాయా,మీ బుద్ధి ఇంతే, మీ జన్మ ఇంతే, మీవన్ని దొంగ బతుకలే అని మండిపడ్డారు. బీద రవిచంద్ర, తాను, కావ్య కృష్ణారెడ్డి ఎంతో ఐక్యంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తుంటే మా మధ్యలో స్పర్ధలు పెట్టి పాదయాత్ర విఫలమైందని రాయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. మా పార్టీ పాదయాత్రపై డ్రోన్ కెమెరా పెట్టి రాయాల్సిన పని ఏముందని ఎవరైనా దీని గురించి మాట్లాడితే నాలుక కోసేస్తానని హెచ్చరించారు. ఎమ్మెల్యే దగ్గర నుండి ముఖ్యమంత్రి వరకు అందరు అవినీతిపరులని వారు మా గురించి దుష్ప్రచారం చేస్తే పుట్టగతులు వుండవని హెచ్చరించారు. పారిశ్రామికవేత్త కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ పైడేరు నుండి కావలి నియోజకవర్గానికి పది వేల మందితో ప్రవేశించిన నారా లోకేష్ ఇస్కపల్లిలో ఇసుక వేస్తే రాలనంత జనం లోకేష్‌ను చూసేందుకు పోటీలు పడ్డారన్నారు. అల్లూరు మండలంలో 35 వేల ఓట్లు, ప్రజలు 55 వేలు వుంటే పాదయాత్రకు 25 వేల మంది హాజరయ్యారన్నారు. ఎంతో ప్రశాంతవాతావరణమైన కావలి నియోజకవర్గంలో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చిచ్చుపెట్టి అగ్నిని రాజేస్తున్నారని మండిపడ్డారు.స్థానిక ఎమ్మెల్యేపై వ్యతిరేకత వల్లే పాదయాత్ర విజయవంతమైందన్నారు.ఎమ్మెల్యే కానీ ఆయన వేసిన కమిటీ కానీ పాదయాత్రను చూస్తే నిజమేమిటో అర్ధమవుతుందన్నారు. మాతో ఐదు రోజులు పాదయాత్రలో నడిస్తే మీరు కూడా వైసిపిని వదిలేసి నాలాగే టిడిపిలో చేరుతారని చలోక్తి విసిరారు.

## డ్రాయింగ్‌మాస్టర్ కిషోర్‌కుమార్‌కి జాతీయ స్థాయి అవార్డ్



**చేజర్ల, జులై9ప్రభాతవార్త:** కోనసీమ జిల్లాకు చెందిన అంజిక్రియేటివ్ ఆర్ట్ అకాడమీ వారు నిర్వహించిన జాతీయస్థాయి చిత్రకళా పోటీలో చేజర్ల జడ్పీ హైస్కూల్‌లో డ్రాయింగ్‌మాస్టర్‌గా పనిచేస్తున్న కళామతల్లి ముద్దుబిడ్డ కుల్లూరు గ్రామస్తుడు తోట కిషోర్‌కుమార్‌వేసిన చిత్రానికి జాతీయ స్థాయి ఎన్‌టిఆర్ బెస్ట్ క్రియేటివ్ ఆర్టిస్ట్ అవార్డు లభించింది. విజయవాడలోని బలోత్సవ భవన్‌లో ఆదివారం జరిగిన బహుమతి ప్రధాన కార్యక్రమంలో అంజిక్రికేటివ్ ఆర్ట్ అకాడమీ ద్వారా అవార్డు అందుకున్నారు. మాస్టారుకి జాతీయస్థాయిలో అవార్డు రావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు , తోటి సిబ్బంది, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు , గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

# జువ్వలదిన్నెలో నారా లోకేష్ పాదయాత్ర





**బిట్రగుంట, జులై 9 ప్రభాతవార్త** బోగోలు మండలం జువ్వలదిన్నె శ్రీ పొట్టి శ్రీరాములు నివసించిన ప్రాంతంలో ఆదివారం నారా లోకేష్ యువగళం పాదయాత్ర కొనసాగింది. వడ్డిపాళెం వద్ద భారీ క్రేన్‌తో గజ మాలతో అపూర్వ స్వాగతం పలికిన ప్రజలు జువ్వలదిన్నె ప్రాంతమంతా ఆయనతో కలిసి పాదయాత్రలో పాల్గొని పలు సమస్యల్ని ఆయన దృష్టికి తెచ్చారు. గతంలో ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిది ద్దేందుకు టిడిపి ప్రభుత్వంలో కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేశామని అయితే వైసిపి అధి కారంలోకి రాగానే అభివృద్ధి కార్యక్ర మాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయని నారా లోకేష్ తెలిపారు. తిరిగి తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వీటిని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అక్కడి నుంచి నారా లోకేష్ చిప్పలేరు వంతెన మీదుగా తన పాదయాత్రని కావలి రూరల్ మండలానికి కొనసాగించారు.ఆయన వెంట నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు, పారిశ్రామికవేత్త కావ్య కృష్ణారెడ్డి, టిడిపి సీనియర్ నేత బీద గిరిధర్, కావలి, బోగోలు, అల్లూరు మండలాల టిడిపి నేతలు పాల్గొన్నారు.

# నూతన కోర్టు భవనం ప్రారంభం



**నెల్లూరు క్రైమ్, జూలై 9,ప్రభాతవార్త** నగరంలోని జిల్లా కోర్టు ఆవరణలో ఆదివారం ఉదయం నూతన న్యాయస్థాన భవనాలను హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ డి.రమేష్‌తో కలిసి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శేషసాయి ప్రారంభించారు. తొలుత నూతన భవనాలను ప్రారంభించేందుకు విచ్చేసిన హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శేషసాయిను జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ యామిని, జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ సాదరంగా ఆహ్వానించారు. అనంతరం పోలీసు గార్డ్ ఆఫ్ హానర్ స్వీకరించారు. అనంతరం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి కోర్టు కాంప్లెక్స్ నూతన భవనాలను ప్రారంభించారు. అనంతరం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో రాణించాలంటే భాగా వాదించగలగడంతో పాటు కొన్ని సమయాల్లో సందర్భానుసారంగా మౌనంగా ఉండటం అనేది చాలా ముఖ్యమని తెలిపారు. తక్కువ వ్యవధిలోనే భవన నిర్మాణాలను పూర్తిచేసి, సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి తన ధన్యవాదాలన్నారు. ముఖ్యంగా జిల్లా పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ డి.రమేష్ తదితరులు ఎంతో కృషి చేశారని ప్రశంసించారు. పనిచేసే ప్రదేశం బాగుంటేనే మంచి ఫలితాలు వస్తాయన్నారు. న్యాయమూర్తుల నుండి మంచి తీర్పులు వస్తున్నాయంటే ఆయా న్యాయవాదులు మంచిగా వాదిస్తున్నారని అర్ధమన్నారు. బార్ అసోసియేషన్ బాగుంటేనే బెంచ్ కూడా బాగుంటుందన్నారు. సీనియర్ న్యాయవాదులు ఎక్కడైతే గౌరవింపబడతారో ఆయా బార్ అసోసియేషన్లు బాగుంటాయన్నారు. మెరికల్లాంటి న్యాయవాదులను అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి డాక్టర్ యామిని, జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్, బార్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఉమామహేశ్వరరెడ్డి, నెల్లూరు జిల్లా బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాద గుమస్తా అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తాం



**కోవూరు జూలై 8ప్రభాతవార్త :** భారతదేశంలో ఆంధ్రప్రదేశ్‌ను సంక్షేమ అభివృద్ధి పథంలో పయనింపజేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైపు అన్ని పార్టీలు చూస్తున్నాయని, త్వరలో కోవూరులో తెలుగుదేశం పార్టీ ఖాళీ కావడం ఖాయమని కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. కోవూరులోని తూర్పు అరుంధతివాడలో తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్ తెలుగుదేశం పార్టీకి గుడ్‌బై చెప్పి తన అనుచరులతో కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం తెలుగుదేశం పార్టీ తమ పార్టీ యొక్క ఉనికిని కాపాడుకునేందుకే ఒకవైపు పాదయాత్రలు, మరోవైపు తమ పార్టీ పైనా, ముఖ్యమంత్రిపైనా విమర్శలు చేయడం పరిపాటిగా మారిందన్నారు. త్వరలో కోవూరులో తెలుగుదేశం పార్టీ నుంచి వైసీపీలో చేరేందుకు అనేకమంది సిద్ధంగా ఉన్నారన్నారు. అయితే ఆయా గ్రామాలకు సంబంధించిన తమ పార్టీ నాయకులతో చర్చించి వారందరినీ పార్టీలోకి ఆహ్వానించడమే కాకుండా వారికి తగు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఈ ప్రాంతంలో మంచి పట్టు కలిగిన రవికుమార్ టీడీపీకి గుడ్‌బై చెప్పి తమ పార్టీలోకి రావడం పట్ల వారిని, వారి అనుచరులను ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు నిరంజన్‌బాబురెడ్డి, కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి ఇవి ఆఖరి ఎన్నికలు అని, అది మునిగిపోయే నావా అని ఇప్పటికే ఆ పార్టీ నాయకులు గుర్తించారని, త్వరలో ఆ పార్టీ నుంచి వలసలు రావడం ఖాయమని పేర్కొన్నారు. పాదయాత్ర చేస్తున్న లోకేషన వట్టి పప్పు సుద్ద అని ఎవరో స్క్రిప్టు రాసిస్తే మాట్లాడుతున్నాడే తప్ప మరొకటి కాదన్నారు. తనది జమిందార్ కుటుంబం అని, అందరికీ మేలు చేస్తామే తప్ప ఆస్తులు కూడగట్టుకునే పని తాము చేయలేదన్నారు. పాదయాత్రకు ఆశించిన మేర ప్రజలు లేక పక్క గ్రామాల నుంచి కూలీలు అరువుకు తెచ్చుకుని పాదయాత్ర చేస్తున్నారని ఎద్దేవా చేశారుఅయితే ప్రస్తుతం పాదయాత్ర చేస్తున్న ఓ పప్పు సాయంత్రం 6 గంటలకు గుహలో నుంచి వచ్చి రాత్రి 11 గంటల వరకు పాదయాత్ర చేస్తున్నారని ఇదేమి పాదయాత్ర అని యద్దేవా చేశారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో పయనింపజేస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి.. పాదయాత్ర చేస్తున్న ఆ పప్పు విమర్శించడం మంచిది కాదన్నారు..ఈ సందర్భంగా పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలోజడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, వైసీపీ యువ నాయకులు నల్లపరెడ్డి రజిత్‌కుమార్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ ఆర్. మల్లికార్జున్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర బొందిలి కార్పొరేషన్ చైర్మన్ కిషోర్ సింగ్, మాజీ సీడీసీ చైర్మన్ సుబ్బారెడ్డి, యువనాయకులు అత్తిపల్లి అనూప్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్ ప్రసాద్, పార్టీ నాయకులు జుబేర్ బాషా, మల్లవరపు చిరంజీవి, అంజన్‌రావు, శ్రీనివాసులురెడ్డి, వెంకటరమణారెడ్డి, శివకుమార్‌రెడ్డి, రాజగోపాలు,కోవూరు సర్పంచ్ విజయ, పడుగుపాడు ఉప సర్పంచ్ అహ్మద్, పార్టీ నేతలు జుబేర్ బాషా, విజయసేనారెడ్డి, ెగంగవరం సర్పంచ్ లక్ష్మీకుమారి,సాయియశ్వంత్‌రెడ్డి, శివాలయం చైర్మన్ సురేష్, జగదీష్, నాగరాజు, వంశీ, ్,..,పెద్ద సంఖ్యలో కార్యకర్తలు ఉన్నారు.

## సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలు చేయాలి



సంగం జులై 9 ప్రభాతవార్త సంగం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆంధ్రప్ర దేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అ బ్యాసవర్గ కార్యక్రమాన్ని ఆపాస్ నా యకులు నిర్వహించారు. ఈకా ర్యక్ర మంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అద్యక్షులు శ్రావణ్‌కు మార్, జిల్లా అద్యక్షులు రాజు, ఎస్‌వి యూనివర్సిటీ ప్రొఫెసర్ వైవిరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో అపస్‌నాయకులు పాల్గొన్నారు.

## రామతీర్థం డాబాల్లో ఘర్షణ

విడవలూరు, జూలై 9,ప్రభాతవార్త మద్యం మత్తులో రెండు డాబాల యాజమాన్యం, మాస్టర్‌ల మధ్య ఘర్షణ నెలకొంది. నిత్యం ఆ డాబాల్లో యాజమాన్యం ప్రజలకు మద్యం సేవించే అనుమతులు ఇవ్వడంతో ఆయా గ్రామాల ప్రజలు గొడవకు దిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకునే ప్రయత్నం జరిగింది. ఆదివారం రెండు డాబాల యాజమాన్యం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే రెండు వర్గాలకు సంబంధించి మండల నాయకులు పోలీసు స్టేషన్‌కు చేరుకుని రెండు డాబాల గొడవలను సర్దిచెప్పే ప్రయత్నాలు చేసినట్లు సమాచారం. ఏది ఏమైనా మద్యం సేవించే(డాబాలలో) అనుమతులు లేకపోయినా కూడా అటు పోలీసులు ఇటు ఎక్సైజ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని స్థానిక మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. అయితే ప్రభుత్వం నిబంధన ప్రకారం వైన్ షాపు ఆవరణలో మద్యం సేవించరాదనే నిబంధనలు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే రామతీర్థం డాబాలో పోలీసులు, ఎక్సైజ్ అధికారులు మడుపులు తీసుకుంటూ డాబాలను కొనసాగిస్తున్నట్లు ప్రజలు బహిరంగంగా అనుకుంటున్నారు. డాబాల్లో యాజమాన్యం విచ్చలవిడిగా మద్యం అక్కడే సేవించే విధంగా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రజలు అనుకుంటున్నారు. దొంగ దొంగలు ఊర్లు పంచుకున్నట్లుగా రామతీర్థం డాబాల్లో ఏమి జరుగుతుందనే విషయాన్ని పక్కన పెట్టి నాయకులు, అధికారులు ముడుపులు మత్తులో ఉండి డాబాలను కొనసాగిస్తున్నారు. ఇకనైనా జిల్లా అధికారులు డాబాలకు మద్యం సేవించే అనుమతులు ఉన్నాయా లేవా అనే విషయాన్ని వెలికితీయాలని ప్రజలు కోరుతున్నారు.

## నారా లోకేష్ రాకతో జనసంద్రంగా మారిన తుమ్మలపెంట



**కావలి, జులై 9 ప్రభాతవార్త** నారా లోకేష్ యువగళం పాదయాత్ర కావలి తీర ప్రాంతంలోని తుమ్మలపెంటకు ఆదివారం రాత్రి చేరడంతో ఆ ప్రాంతం జనసంద్రంగా మారింది. వివిధ సాంస్కృతిక బృందాలు, బాణాసంచా శబ్దాలు, పూలవర్షం మధ్య మత్స్యకారులు కనీవినీ ఎరుగుని రీతిలో నారా లోకేష్‌కు స్వాగతం పలికారు. నారా లోకేష్ రాకతో మత్స్యకార గ్రామాల్లో జనం నీరాజనం పలికారు. రాత్రి 9 గంటలైనా ఇసుక వేస్తే రాలనంత జనం తుమ్మలపెంటలో పెద్దఎత్తున పాల్గొని లోకేష్‌కు స్వాగతం పలికారు. లోకేష్, చంద్రబాబు, తెలుగుదేశం పార్టీ జిందాబాద్ అన్న నినాదాలతో తీర ప్రాంతం మారుమోగింది. టిడిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు నాయకత్వంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, మత్స్యకారులు పెద్దఎత్తున తరలివచ్చారు. తుమ్మలపెంటలో రాత్రి నారా లోకేష్ బస చేశారు.

## సామాజిక సమరసతా వేదిక మహిళా సమావేశం



**బుచ్చి జులై 9 ప్రభాతవార్త:** పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలో జిల్లా సామాజిక సమరసత వేదిక ఆద్వర్యంలో మహిళా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల నుండి మహిళలు కార్యక్రమానికి తరలివచ్చారు వేదిక ప్రాంత మహిళా ప్రముఖ జయప్రద అద్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో దేవికప్రాంత కార్యకారిని సభ్యులు కోడూరు సత్యం, జిల్లా సంయోజకు శ్రీలక్ష్మి, నారాయణ,జిల్లా అద్యక్షులు నేలనూతల శ్రీదర్, జిల్లా కార్యదర్శి గోళ్ళ కేశవులు,నెల్లూరు టౌన్ మహిళా అద్యక్షురాలు నేలవేణి,టిపి గూడూరు మండలాద్యక్షులు రాధాకృష్ణ, బుచ్చి మండల ప్రధానకార్యదర్శి శ్రీదర్, పాల్గొన్నారు.కోడూరు సత్యం మాట్లాడుతు సమాజంలో రుగ్మతలు పోగొట్టాలంటే సామాజిక సమరసత ఒక్కటే పరిష్కారం అని అన్నారు. దానిని అందరు తూచా తప్పకుండా పాటించగలిగితే సమాజంలో వ్యత్యాసాలు అనేవి ఉండవని అన్నారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతు సమాజం అనేది అన్ని దొరికే బాండాగారమని మనుషుల యొక్క మనస్తత్వాన్ని బట్టి సమాజం నడుస్తుందని అన్నారు.జయప్రద మాట్లాడుతు సమాజాభివృద్ధి మహిళలతోనే సాద్యమని అన్నారు.కేశవ మాట్లాడుతు సమరసత వేదిక అబివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.శ్రీదర్ మాట్లాడుతు మాకు కులమతబేదాలు లేవని సమరసతవేదిక అందరిని ఒకే విధంగా చూస్తుందని అన్నారు. అందరు భారతీయులమేనన్న సమానత్వంతో ముందుకు సాగుదామని తెలియజేశారు. మహిళలందరికి జాకెట్టు,పండ్లు, తాంబూలం ఇచ్చారు.ఈకార్యక్రమంలో మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## క్షతగాత్రుడికి జిఎంకె ట్రస్టు ఆర్ధిక సహాయం



**ఉదయగిరి జులై 9 ప్రభాతవార్త:** ఉదయగిరి మండలంలోని గండిపాళెం గ్రామానికి చెందిన గోరంట్ల ఓబయ్య కుమారుడు కృష్ణయ్య ఇటీవల జరిగిన బైకు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి నెల్లూరులోని ఒ ప్రవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు.ఈ ప్రమాదవిషయాన్ని కుటుంబసభ్యుల ద్వారా తెలుసుకున్న ఉదయగిరి మండల ఉపాధ్యాక్షులు జి.ఎం.కె ట్రస్టు అధినేత గుంటుపల్లి మాలకొండయ్య చౌదరి తన ట్రస్టు సభ్యుల ద్వారా ఆ కుటుంబసభ్యులకు తక్షణ ఆర్ధిక సహాయంగా పది వేల రూపాయాలు అందజేశారు.ఈ సందర్భంగా కుటుంబసభ్యులు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.ఈకార్యక్రమంలో ట్రస్టు ప్రతినిదులు బి .వెంకటేశ్వర్లు,పాములరాజా, జి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి తీర్ధం తీసుకున్న కాండ్ర సతీష్‌నాయుడు



**బిట్రగుంట, జులై 9 ప్రభాతవార్త:** బోగోలు మండలం నాగులవరం గ్రామ నివాసి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, పలు సేవా కార్యక్రమాల్ని చేపడుతున్న కాండ్ర సతీష్ యువనేస్తం వ్యవస్థాపకులు కాండ్ర సతీష్‌నాయుడు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఆదివారం టిడిపిలో చేరారు. ఇటీవల పలు సేవా కార్యక్రమాలు చేపడుతూ టిడిపి సిద్ధాంతాలకు ఆకర్షితులై మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని తిరిగి అధికారంలోకి తీసుకురావాలనే ఉద్దేశంతో నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు సమక్షంలో తాను చేరినట్లు విలేకర్లకు ఆయన వివరించారు.ఈ సందర్భంగా నారా లోకేష్ చిన్ననాటి ఫోటో జ్ఞాపికను ఆయన అందజేశారు.

## పెనుగొండమ్మ ఉత్సవాలలో కావలి ఎమ్మెల్యే



**బిట్రగుంట, జులై 9 ప్రభాతవార్త:** బోగోలు మండలం జువ్వలదిన్నె గ్రామంలో ఆదివారం గ్రామదేవత పెనుగొండమ్మ ఉత్సవాలలో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తిరునాళ్ళలో ఎద్దుల బండలాగుడు పోటీలను ప్రారంభించి గ్రామస్తుల్ని, నిర్వాహకుల్ని ఉత్సాహపరిచారు.ఆయన వెంట నియోజకవర్గంలోని వైసిపి నేతలు పాల్గొన్నారు.

## బాధితురాలికి రూ29వేలు విరాళం



**వలేటివారిపాలెం జూలై 9, ప్రభాతవార్త :** మండలంలోని చిన్నమ్మపాలెంలో గత నెల 29వ తేదీన వంటగ్యాస్ సిలెండర్ లీకవడంతో ఇంద్రకంటి ఎలీసమ్మ పూరిల్లు పూర్తిగా దగ్గమైంది. దీంతో ఆమె నిరాశ్రయురాలైంది.దీంతో అమ్మపాలెం సేవాసమితి మరియు బెస్ట్ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్స్ వారు స్పందించారు. బాధితురాలుకు రూ.29వేలు ఆర్ధిక సహాయం ప్రకటించారు. ఈ మొత్తాన్ని శనివారం స్దానిక వైసీపీ నేత చెన్నుబోయిన శ్రీనివాసులు బాధితురాలకు అందచేశారు.

## ద్రోణాదుల రాఘవ వైద్య ఖర్చులకు 30 వేలు ఆర్థిక సహాయం



**కావలి, జులై 9 ప్రభాతవార్త** కావలి పట్టణం 33వ వార్డులోని కమ్మరివీధిలో నివ సిస్తున్న ద్రోణాదుల రాఘ వ వైద్య ఖర్చుల కోసం ఈ వార్డు మాజీ కౌన్సిలర్, వైసిపి వైశ్య నేత అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్తా ఆధ్వర్యంలో ఆదివారం 30 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కావలి మండల ఆర్యవైశ్య సంఘం, కావలి డివిజన్ ఆర్యవైశ్య సంఘం నేతలు, పట్టణంలోని ఆర్యవైశ్య నేతలు రాఘవ నివాసానికి వెళ్లి 30 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అమరా మాట్లాడారు. ద్రోణాదుల రాఘవకు ఆరు నెలల క్రితం పక్షవాతం వచ్చి బ్రెయిన్ స్ట్రోక్ తగిలిందన్నారు. ఊపిరితిత్తుల సమస్య కూడా వుందన్నారు. చెన్నై, నెల్లూరు, గుంటూరు వైద్యశాలలో దాదాపు 12 లక్షలు దాకా ఖర్చు అయిందన్నారు. చిన్నపాటి వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రాఘవ అనారోగ్యంతో కుటుంబ పోషణ భారమైందన్నారు. పది లక్షలకు పైగా అప్పులు చేసి వైద్యానికి ఖర్చు పెట్టినా జబ్బు నయం కాలేదన్నారు. దీంతో ఆయనకు వైశ్య నేతల నుంచి 30 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ మనోహర్‌బాబు,నల్లూరు వెంకట రమేష్, ఒరుగంటి రామకృష్ణ, పాదర్తి నాగరాజు, వాకాటి మాల్యాద్రి, వి.యం.యస్.ఆర్.మాలి, పెట్టుగాని రమేష్‌బాబు, పొన్నూరు శ్రీనివాసులు, పబ్బర్తి సత్యనారాయణ, విశ్వనాధుని కిషోర్, గాదంశెట్టి మధుసూదన్‌రావు,చినకొండలరావు, గొల్ల వెంకట సుధాకర్, బొగ్గవరపు వెంకటేశ్వర్లు, పెసల వెంకటేశ్వర్లు, నవీన్‌కుమార్, నల్లూరు రామకృష్ణ, నేరెళ్ల ఉదయ్, చెంగలరావు, దుగ్గిశెట్టి నవీన్, ఓలేటి రాము తదితరులు పాల్గొన్నారు.

## నేడు గడప,గడపకు మనప్రభుత్వం

**దుత్తలూరు(వరికుంటపాడు),జులై9,ప్రభాతవార్త:** మండలంలోని దుత్తలూరు బిట్2 సచివాలయ పరిధిలో సోమవారం గడప,గడపకు మనప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఈకార్యక్రమానికి ముఖ్యఅతిదిగ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాలరెడ్డి పాల్గొంటారని మండలపార్టి కన్వినర్ దొంతి రెడ్డి వాసుదేవారెడ్డి తెలిపారు.ఈకార్యక్రమం మద్యాహ్న రెండుగంటలకు ప్రారంభమవుతుందని కావున మండలస్తాయి అదికారులు ఎం.పి.టి.సిలు,జట్.పి.టి.సి సర్పంచ్‌లు,పార్టీనాయకులు కార్యకర్తలు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

## పెళ్లి కుమారుడిని ఆశీర్వదించిన కోవూరు ఎమ్మెల్యే



**కోవూరు జూలై 8ప్రభాతవార్త :** కోవూరు మండలం గంగవరం సచివాలయంకు చెందిన ఇంజనీరింగ్ అసిస్టెంట్ షేక్ ఇరిషాద్ వివాహ వేడుకలు ఆదివారం నెల్లూరు డీఎసనఆరన కళ్యాణ మండపంలో జరిగాయి. ఈ వేడుకల్లో కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు నిరంజన్‌బాబురెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు, రాష్ట్ర బొందిలి కార్పొరేషన్ చైర్మన్ కిషోర్ సింగ్, జడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, గంగవరం గ్రామ సర్పంచ్ లక్ష్మీకుమారి, జ్యోతి తదితరులు ఉన్నారు.

## గోపాలకృష్ణయ్య భౌతిక కాయానికి నివాళులర్పించిన సోమిరెడ్డి



**నెల్లూరు జూలై 9, ప్రభాతవార్త-వైద్యం:** విజయ డెయిరీ మాజీ చైర్మన్ ముప్పవరపు గోపాలకృష్ణయ్య చౌదరి భౌతిక కాయానికి తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదివారం గాంధీబొమ్మ సెంటర్ సమీపంలో ఉన్న గోపాలకృష్ణయ్య నివాసంలో పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. గోపాలకృష్ణయ్యచౌదరితో మా కుటుంబానికి 40 ఏళ్లగా అనుబంధం ఉందని సోమిరెడ్డి అన్నారు. 22ఏళ్ళపాటు విజయ డెయిరీ చైర్మన్‌గా పనిచేసిన ఆయన పాడి రైతులకు అన్నివిధాల అండగా నిలవడంతోపాటు డెయిరీని అభివృద్ధి పథంలో నడిపించారని కొనియాడారు. ఐదేళ్ళు జిల్లా లైవ్‌స్టాక్ డెవలప్‌మెంటు ఏజెన్సీ చైర్మన్‌గా కూడా సేవలు అందించారని, 27ఏళ్ళుపాటు రైతులకు గోపాలకృష్ణయ్య అందించిన సేవలు ఏనలేవని కొనియాడారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబసభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని ఆయన భగవంతుడిని ప్రార్ధించారు.

## చంద్రబాబునాయుడుని కలిసిన తడకపల్లి సుధరవీంద్ర



**నెల్లూరుజూలై 9, ప్రభాత వార్త-వైద్యం** : ఇటీవల కాలంలో తెలుగుదేశం పార్టీ సాధికార బ్రాహ్మణ సమితి రాష్ట్ర సభ్యురాలిగా నియమి ంచబడ్డ తడకపల్లి సుధరవీంద్ర ఆదివారం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును మర్యాదపూర్వకంగా హైదరాబాదులోని ఆయన నివాసంలో కలిసి సుధ కృతజ్ఞతలు తెలిపి, ఆయనకు శ్రీ వేంకటేశ్వరస్వామి వారి శేషవస్త్రం, ప్రసాదాలను అందచేశారు.

## గడపగడప హామీలు పరిష్కారం - హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



**వలేటివారిపాలెం జూలై 9, ప్రభాతవార్త :** మండలంలోని పోలినేనిచెరువు, రామచంద్రాపురం గ్రామాలలోని తాగునీటి సమస్య పరిష్కరించడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత కొంత కాలంగా ఈ గ్రామాల్లో రక్షిత మంచి నీటి సౌకర్యం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపద్యంలో ఇటీవల ఆయా గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సమస్యను ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డికి దృష్టికి తెచ్చారు.ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే సంబందిత అధికారులును జెజెఎం స్కీం ద్వారా సమస్య పరిష్కారానికి పురమాయించారు. దీంతో పెదమ్మపాలెంలో సర్పంచ్ యాళ్లసుబ్బరాజ్యమ్మ మరియు వైసీపీ నేత శివకుమార్‌రెడ్డి పర్యవేక్షణలో ఇంటింటికి కొళాయి ఏర్పాటుచేశారు.దీంతో ప్రగడ శ్రీనివాసులు,చల్లగొలుసు మాలాద్రి,చీమల నరసింహారెడ్డి తదితరులు మాట్లాడుతూ గడప గడప కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యే మా గ్రామానికి రావడంతో మాకు ఎంతో మేలు జరిగిందన్నారు.ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డికి,సర్పంచ్ సుబ్బరాజ్యమ్మకి కృతజ్ఞతలు తెలిపారు.అదేవిధంగా అంకభూపాలపురం పంచాయితీలోని రామచంద్రాపురం గ్రామంలో మురుగుకాలువుల సౌకర్యం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు వైసీపీ నేతలు బాపతు మాలకొండయ్య,పల్లాల వెంకటేశ్వరరెడ్డి,నాగిరెడ్డి తదితరులు గడపగడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డికి వివరించారు.దీంతో ఎమ్మెల్యే ఆదేశాలతో డ్రైనేజి పైపు లైన్ సిస్టమ్‌ను ఏర్పాటు చేస్తున్నారు.ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.

## జగనన్న కాలనీలో బోరు ఏర్పాటు



**వింజమూరు,జులై9ప్రభాతవార్త:** వింజమూరు మండలం ఊటుకూరు పంచాయతీ లోని సచివాలయ పరిధిలో పేదలకు మంజూరుచేసిన జగనన్న కాలనీలో ఆదివారం బోరు, మోటారును ఏర్పాటు చేశారు. సర్పంచ్ రొడ్డా వెంగమ్మ, మాజీ ఎంపిటిసి సభ్యులు రొడ్డా కొండయ్య, మండల వైసిపి కన్వీనర్ రేవనూరు శ్రీనివాసులురెడ్డిలు బోరును ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ పరిధిలో 70మందికి ఇంటి పట్టాలు మంజూరు చేశారని త్వరలో ఇంటి నిర్మాణాలను చేపట్టేందుకు లబ్ధిదారులు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు కొండపల్లి రమేష్, ధనాల రమణయ్య, మద్దూరు చంద్రశేఖర్‌రెడ్డి, మద్దూరు బాలకృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి పెంచలయ్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారులు సరైన పత్రాలు ఉంచుకోవాలి



**సైదాపురం జులై 9ప్రభాతవార్త:** వాహనాలకు సంబందించి వాహనదారులు సరైన పత్రాలను తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకోవాలని సైదాపురం ఎస్ఐ చల్లావాసు తెలిపారు. మండలకేంద్రమైన సైదాపురంలోని జువ్వలగుంట సమీపంలో ఆదివారం ద్విచక్రవాహనాలను తనీఖి చేసి సరైన పత్రాలు లేని వాటికి జరిమానా విధించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రతి వాహనదారుడు సరైన పత్రాలను అందుబాటులో ఉంచుకొని ప్రభుత్వ నిబంధనల ప్రకారం హెల్మెంట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు.లేని పక్షంలో జరిమానా విదించడం జరుగుతుందని హెచ్చరించారు.ఆయన వెంట హెడ్‌కానిస్టేబుల్ నారయ్య, తదితరులున్నారు.

## జగనన్న సురక్ష సర్వే పరిశీలన



**సైదాపురం జులై 9 ప్రభాతవార్త:** మండల పరిధిలోని లింగ సముద్రం గ్రామ సచివాలయం పరిధిలో అధికారులు,సచివాలయ సిబ్బంది,వాలింటరీలు నిర్వహిస్తున్న జగనన్న సురక్ష సర్వే కార్యక్రమాన్ని ఏఒ పురుషోత్తమ్ శివకుమార్ ఆదివారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజా సమస్యలు గుర్తించాలని తెలిపారు. సర్వే చేసే క్రమంలో డోర్‌లాక్ వున్న గృహముల విషయంలో వారిని పోన్ ద్వారా సంప్రదించి పగడ్బందిగా సర్వే చేయాలని తెలిపారు.ఈకార్యక్రమంలో సచివాలయ సిబ్బంది వాలింటరీలున్నారు.

## గాంధీ ఆశ్రమంలో ప్రార్ధనలు



**ఇందుకూరుపేట, జూలై 9,ప్రభాతవార్త :** మండలంలోని పల్లెపాడు పినాకిని సత్యాగ్రహ గాంధీజీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్ధనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన నెల్లూరు రవీంద్ర రెడ్డి ప్రార్ధనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా గ్రామ సర్పంచ్ రెడ్డిపోగు సుధాకర్ రాపూర్ హైస్కూల్ టీచర్ పీవీ శేషయ్య మహాత్మగాంధీ విగ్రహానికి పోనక కనకమ్మ విగ్రహానికి ఖాదీ వస్త్రము, నూలు మాల సమర్పించారు. అనంతరం విద్యార్దులకు కోర్ కమిటీ సభ్యులు గంపల మంజుల స్వాతంత్ర్య సమరయోధులు యొక్క సిద్దాంతాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డైట్ కాలేజీ విద్యార్దులు, స్కూల్ విద్యార్ధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కరంటుషాక్‌తో ఎద్దుమృతి



**జలదంకి,జులై9,ప్రభాతవార్తః** జలదంకి మండలం బ్రాహ్మణక్రాకలో పాజర్ల సుబ్బయ్యకు చెందిన ఎద్దు కరెంటుషాక్‌తో మృత్యవాతపడింది.బాదితరైతు కదనం మేరకు రోజుమాదిరే తన కాడెద్దులను మేపుకై పొలాలలోకి తోలుకెళ్ళాడు. అయితే కరంటు ట్రాన్స్‌పార్మర్ గట్టుపైవుండి తక్కువ ఎత్తులో తీగలువున్నందున తగిలి ఎద్దు ఒక్కసారిగ కిందపడిపోయింది.పరుగునవెళ్ళి పరిశీలించి చూడగ మృతిచెందివుందని వాపోయాడు. సేద్యం చేసుకొని కుటుంబాన్ని పోషించే దళితుడనైన తనకు ఆదరవు కోల్పోయానని విచారం వ్యక్తంచేశాడు.దీనిపై జలదంకి పోలీసులకు ఫిర్యాదుకూడా చేసినట్లు చెప్పాడు కావున అదికారులు విచారించి తగు సాయంచేసి ఆదుకోవాలని బాదితుడు విజ్ఞప్తిచేశాడు .

## రాష్ట్రంలో ముస్లీం సంక్షేమానికి బాటలు వేసిన నేతలు ఇరువురేమసీదు మదరసాకు శంకుస్థాపన



**కోవూరు జూలై 8ప్రభాతవార్త :** కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీలోని నేతాజీనగర్‌లో నిర్మాణం చేపట్టనున్న మసీదు, మదరసాలకు ఆదివారం కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొని శంకుస్థాపన కార్యక్రమాలను సాంప్రదాయబద్దంగా నిర్వహించా రూష్టంలో ముస్లీం సంక్షేమానికి బాటలు వేసిన నేతలు ఇరువురేనని ఒకరు దివంగతనేత రాజశేఖర్‌రెడ్డి కాగా మరొకరు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. గతంలో రాజశేకర్‌రెడ్డి సిఎంగా ఉన్న సమయంలో ముస్లీం కొరకు రిజర్వేషన్ ఇచ్చిన ఘనత ఆయనకే దక్కిందని అన్నారు.మదరస్సా నిర్మాణానికి కృషి చేస్తున్న కమీటికి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా లక్షరూపాయాలు అందజేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు నిరంజన్‌బాబురెడ్డి, కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, వైసీపీ యువ నాయకులు నల్లపరెడ్డి రజిత్‌కుమార్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, వైసీపీ యువ నాయకులు నల్లపరెడ్డి రజిత్‌కుమార్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ ఆర్. మల్లికార్జున్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర బొందిలి కార్పొరేషన్ చైర్మన్ కిషోర్ సింగ్, మాజీ సీడీసీ చైర్మన్ సుబ్బారెడ్డి, పడుగుపాడు సర్పంచ్ లక్ష్మీనారాయణ,,కోవూరు సర్పంచ్ విజయ, గంగవరం సర్పంచ్ లక్ష్మీకుమారి ఉప సర్పంచ్ అహ్మద్, జలజీవన్ మిషన్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు బాబురావు, అసోసియేషన్ అధ్యక్షుడు సయుద్ రఫీ జుబేర్‌బాషా, పెద్ద సంఖ్యలో ముస్లిం నాయకులు ఉన్నారు.

## యువగళం పాదయాత్రను విజయవంతం చేయాలి



**ఉలవపాడు, జూలై 9, ప్రభాతవార్త** నియోజకవర్గంలో త్వరలో జరగనున్న నారా లోకేష్ యువ గళం పాదయాత్రపై చర్చించేందుకు ఆదివారం ఉలవపాడు టిడిపి మండల కార్యాలయంలో టిడిపి అధ్యక్షులు రాచగల్లు సుబ్బారావు మండలస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి, మాజీ శాసనసభ్యులు డాక్టర్ దివి శివరాం హాజరైయ్యారు. ముందుగా ఈ సమావే శాన్ని ఉద్దేశించి ఆయన దివి శివరాం మాట్లాడుతూ ఈ నెల 15న కందుకూరు నియోజ కవర్గంలో జరగబోవు నారా లోకేష్ యువగళం పాదయాత్రలో స్వచ్ఛందంగా పాల్గొని పాద యాత్రను విజయ వంతం చేసేందుకు నియోజకవర్గ ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. ఈ పాదయాత్రను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్క కార్యకర్త తమవంతుగా కృషి చేయాలని కోరారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 15న ఉదయం రాళ్లపాడు ప్రాజెక్టు మీదుగా నారా లోకేష్ పాదయాత్ర నియోజకవర్గంలోకి ప్రవేశిస్తుం దని, అందుకోసం భారీఎత్తున స్వాగత కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలి పారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వచ్చేలా పార్టీ కార్యకర్తలు కృషిచేయాలన్నారు. పార్టీ ముఖ్యనేతలు అందరూ చాలెంజ్‌గా తీసుకుని, యువగళం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి సుదర్శి శ్రీనివాసులు, అన్ని గ్రామాల నుంచి పార్టీ అధ్యక్షులు, ముఖ్యనేతలు హాజరైయ్యారు.







## యువగళం పాదయాత్ర పైలాన్ ఏర్పాట్లను పరిశీలించిన మాలేపాటి



**కావలి రూరల్, జులై 9 ప్రభాతవార్త** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌బాబు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యువగళం పాదయాత్ర 2 వేల కిలోమీటర్లు కావలి మండలం కొత్తపల్లి గ్రామంలో పూర్తవుతుంది. దీనిని పురస్కరించిన ఆదివారం తెలుగుదేశం పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు కొత్తపల్లిలో పైలాన్ ఏర్పాట్లను, సిరిపురంలో బస ఏర్పాట్లను పరిశీలించారు. అక్కడ తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు తగిన సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కావలి పట్టణ 31వ వార్డు టిడిపి ఇన్‌చార్జ్ మంచాల ప్రసాద్, జిల్లా తెలుగుయువత ఉపాధ్యక్షులు గుర్రం సునీల్, నాయకులు కమతం బలరాం, తదితర నేతలు పాల్గొన్నారు.

## ఘనంగా మహాజనసోషలిస్ట్ పార్టీ జెండావిష్కరణ



**వింజమూరు, జులై9ప్రభాతవార్త:** వింజమూరు పంచాయతీ పరిధిలోని నేరేడుపల్లిలో ఎంఎస్ మహిళా అధ్యక్షురాలు మందా సుజాత ఆధ్వర్యంలో ఆదివారం ఎంఎస్‌పి జెండాను ఆవిష్కరించారు. ఈకార్యక్రమానికి పార్టీ జాతీయ నాయకులు గొల్లపల్లి శ్రీనివాసులు, ఎంఎస్‌పి జిల్లా కన్వీనర్ పందిటి అంబేద్కర్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాజనులను రాజ్యాధికారంవైపు నడిపే దిశగా మంద కృష్ణమాదిగా మహాజన సోషలిస్ట్ పార్టీని స్థాపించారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ ప్రజలు ఎవరయితే రాజ్యాధికారినికి దూరంగా ఉన్నారో వారందరినీ కలుపుకొని మహాజను రాజ్యాధికారాన్ని సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారన్నారు. అనంతరం మహాజన సోషలిస్ట్ పార్టీ మండల కన్వీనర్‌గా నీలం శ్రీనివాసులు, కో కన్వీనర్‌గా ఇండ్ల పోలయ్యను ఎంపిక చేశారు. ఈకార్యక్రమంలో ఎంఎస్‌పి జిల్లా మహిళా ఇన్‌చార్జ్ జి.జానకి, ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ తిరుమలేష్, కలిగిరి మండల ఇన్‌చార్జ్ ఎన్.వెంగళరావ్, ఎంఎస్‌పి మండల ఇన్‌చార్జ్ గోచిపాతల ఆనంద్, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి నాయకులు లక్ష్మయ్య, బాబు, సురేష్, రవీంద్ర, రాకేష్, వెంగళరావ్, తిరుపాలు, శీనయ్య, శ్రీనివాసులు, మురళి, మహేష్, శ్రీనాథ్‌లు పాల్గొన్నారు.

## పేద పిల్లలను సంరక్షించడం అభినందనీయం



**కావలి, జులై 9 ప్రభాతవార్త** సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గంగపట్నం సురేంద్ర పేద పిల్లలను సంరక్షించడం ఎంతైనా అభినందనీయమని కావలి ఐయంఎ డాక్టర్లు తెలిపారు. కావలి సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో సంస్థ సంరక్షణలో వున్న 27 మంది పిల్లలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు, బియ్యం, పిల్లల పేర్ల మీద పోస్టాఫీసులో ప్రతి నెల వెయ్యి రూపాయల నగదు జమ చేసే పుస్తకాలను ఐయంఎ డాక్టర్లు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఐయంఎ డాక్టర్లు బెజవాడ రవికుమార్, కామంచి సుబ్బారావు, టి.శ్రీధర్, కె.ఆనంద్‌లు పాల్గొని మాట్లాడారు. సంయుక్త సేవా సంస్థ ద్వారా పది నెలల నుండి 27 మంది పిల్లలను వారి సంరక్షకుల వద్దే వుంచి సంరక్షణ బాధ్యతలు సంస్థ స్వీకరించి అవసరమైన విద్య, వైద్యం అందించడం అభినందనీయమన్నారు. పిల్లలకు సాయం చేస్తున్న దాతలకు అభినందనలు తెలిపారు. పిల్లలు శ్రద్ధగా చదువుకొని మంచి ఉన్నత విద్యను అభ్యసించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ హ్యాండ్స్ సభ్యురాలు వేమూరి శ్రీలేఖ జన్మదినం సందర్భంగా సంస్థ రక్షణలో వున్న పిల్లలకు నోటుపుస్తకాలు, స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు బుర్లా రఘుకుమార్‌రెడ్డి, గంధం ప్రసన్నాంజనేయులు, యం.వి.యన్.ప్రసాదరావు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గంగపట్నం సురేంద్ర, వేమూరి గాయత్రి, వేమూరి శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

## పట్టుకున్నారు.. వదిలేశారు..!

**విడవలూరు, జూలై 9, ప్రభాతవార్త** మండలంలోని గాజులదిన్నె గ్రామంలో కోడిపందాల స్థావరాలపై పోలీసులు ఆదివారం మెరుపు దాడులు నిర్వహించారు. 16 మందిని కోడి పందాల స్థావరాల వద్ద పట్టుకుని రాజకీయ నాయకుల ఒత్తిడి వల్ల వదిలేసినట్లు స్థానిక ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. స్థానిక ఎస్సై ఆంజనేయులును వివరణగా కోరగా ఒకరిని అదుపులోకి తీసుకున్నామని ఆయన తెలిపారు.

## ఘనంగా ఎబివిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**వింజమూరు, జులై9ప్రభాతవార్త:** వింజమూరు పట్టణంలో అఖిల భారత విద్యార్థిపరిషత్ 75వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను వింజమూరు ఎబివిపి బాగ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వ హించారు. ఆది వారం స్థానిక వైఆర్ జూనియర్ కళాశాల సమీపంలో ఆవిర్భావ పతాకాన్ని ఎబివిపి నగర కార్యదర్శి విష్ణు ఆవిష్కరిం చారు. ఈసందర్భంగా ఆయన మా ట్లాడుతూ అఖిల భారత విద్యార్థి పరిషత్ 74సంవ త్సరాలు పూర్తిచేసుకొని 75వ సంవ త్సరంలో అడుగిడిందన్నారు. నిరంతరం విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం దేశం కోసం పనిచేసే ఏకైక విద్యార్థి సంఘం ఎబివిపి మాత్రమే నన్నారు. విద్యా ర్థుల సమస్యల పరిష్కారం కోసం దేశంలోనే క్రియా శీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామకృష్ణ, శ్రీను, ప్రభాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

## కోవూరులో పాదయాత్ర విజయవంతం..



**కోవూరు జూలై 8ప్రభాతవార్త** : కోవూరు నియోజకవర్గంలో ఇటీవల టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌బాబు చేపట్టిన యువగళం పాదయాత్ర పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమిష్టి సహకారంతో పూర్తిస్థాయిలో విజయవంతం అయిందని, ఇందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని కోవూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దినేష్‌రెడ్డి అన్నారు. కోవూరులోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ పాదయాత్రకు కోవూరు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో స్వచ్ఛందంగా ప్రజలు ముందుకు వచ్చి లోకేష్‌బాబుకు ఘన స్వాగతం పలికారన్నారు. కోవూరు నియోజకవర్గానికి తెలుగుదేశం పార్టీ కంచుకోట అని ఈ పాదయాత్ర ద్వారా మరింత రుజువైందన్నారు. అయితే ఈ పాదయాత్ర గురించి కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి సంస్కార హీనంగా మాట్లాడడం దారుణమన్నారు. లోకేష్ బాబు కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డిపై నిర్దిష్టమైన ఆరోపణలు చేస్తే వాటికి సమాధానం చెప్పకుండా దారుణంగా మాట్లాడారన్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌ను ఈ ప్రభుత్వం అదోగతి పాలు చేయడమే కాకుండా పూర్తిగా అప్పులమయం చేసి ప్రజల నెత్తిన మోయలేని భారం మోపారన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతుందని, ఈ పాదయాత్రకు వచ్చిన ప్రజా స్పందన చూసి వైసీపీ నాయకులకు కళ్లు బైర్లు కమ్మాయన్నారు. ఇప్పటికైనా ఆయన మా మాజీ ముఖ్యమంత్రిపైనా, లోకేష్‌బాబు పైనా అవాకులు, చవాకులు పేలడం మానుకోవాలని హితవు పలికారు. ఎన్నికలు సమీపిస్తున్న కొలది తమ పార్టీ నాయకులను సామ, భేద, దాన, దండోపాయాల ద్వారా పార్టీలోకి చేర్చుకుంటున్నారే తప్ప వారు స్వచ్ఛందంగా పార్టీని విడలేదన్నారు. రానున్నది తెలుగుదేశం ప్రభుత్వమేనని, ఈ పార్టీకి తిరోగమనం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రైతుల రాజ్యం అని గొప్పలు చెప్పుకుంటున్న ఈ ప్రభుత్వం గత సీజన్‌కు ధాన్యం తోలిన రైతులకు ఇంకా బకాయిలు ఉన్నారన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి, లేగుంటపాడు సర్పంచ్ రాజగోపాల్‌రెడ్డి ప్రసంగించారు. నేతలు బాలరవి, నాగరాజు, మహేష్, హరిబాబు, వెంకటరమణమ్మ, మురళి, గౌతమ్‌కుమార్, నాటకరాణి వెంకట్, కృష్ణచైతన్య, సుధాకర్‌రెడ్డి, సుబ్బానాయుడు, నాగేశ్వరరావు, యాకసిరి వెంకటరమణమ్మ, టవికుమార్, రాము, వెంకటేశ్వర్లు, పెద్ద సంఖ్యలో నాయకులు ఉన్నారు.

## 16న గౌడ్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



**ముత్తుకూరు, జూలై9, ప్రభాతవార్త** ఉమ్మడి జిల్లాలోని గౌడ్ విద్యార్థులకు 16వ తేదీన నెల్లూరు టౌన్ హాల్లో 10వ తరగతి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించడం జరుగుతుందని జిల్లా గౌడ్ కల్లుగీత పారిశ్రామిక సంఘం ఉపాధ్యక్షుడు, పంటపాలెం సర్పం చ్ ఆలపాక సీనయ్య అన్నారు. ఆదివారం పంటపాలెంలోని తన నివాసం వద్ద విలేకర్ల సమావేశం ఏర్పాట్లు చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ స్వర్గీయ కోసూరు గోవిందయ్య గౌడ్ ఒక గౌడ్ సేవాసమితి స్థాపించారన్నారు. గౌడ్ విద్యార్థులకు కల్లుగీత కార్మికులు అండగా నిలిచిన వ్యక్తి ఈ రోజు మన మధ్యలో లేకపోవడం చాలా భాదాకరమ న్నా రు. ఆయన గౌడ్ వృత్తిలో ఎదురైన సమస్యలు ముందుండిపోరాటాలు చేసి మహోన్నత వ్యక్తి గోవిందయ్య గౌడ్ అన్నారు. సేవా సమితి ట్రస్ట్‌ను గోవింద్ అన్న ట్రస్ట్‌గా మార్చడం జరిగిందన్నారు. ప్రతి సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు 5వేల రూపాయలుతో పాటు గౌరవ పురస్కారాలతో వారి తల్లిదండ్రులను అభినందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి అద్దంకి శ్రీధర్‌బాబు ఐఎఎస్ కార్యదర్శి టొబాకో బోర్డు గుంటూరు, ఎం.శివప్రసాద్, ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ కార్పొరేషన్ జాయింట్ డైరెక్టర్, కట్ట రామ్మోహన్ రావు, అసిస్టెంట్ కమిషనర్ అన్నం సుబ్రహ్మణ్యం గౌడ్, డీన్ వెల్ టెక్ యూనివర్సిటీ అవడి చెన్నై, జానా రామచంద్రయ్య గౌడ్, పారిశ్రామిక వేత్త చెన్నై, రావుల దశరామయ్య గౌడ్ ఎంపీటీసీ నిడదవోలు పొదలకూరు, నాయుడు రాంప్రసాద్ గౌడ్ కావలి, డైరెక్టర్ గౌడ్ కార్పొరేషన్, బడుగు కృష్ణమూర్తి గౌడ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ నెల్లూరు, రావుల లావణ్య గౌడ్ ప్రొఫెసర్ ఎన్.బి.ఆర్. ఇంజనీరింగ్ కాలేజ్ విద్యానగర్ తోపాటు నెల్లూరు జిల్లాలోని ప్రముఖులు పాల్గొంటారని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ఆనం జన్మదిన వేడుకలకు తరలిరండి - కేశవచౌదరి



**చేజర్ల, జులై9ప్రభాతవార్త:** సోమవారం ఉదయం 9గంటలకు ఆంధ్రప్రదేశ్ మాజీమంత్రి, వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణరెడ్డి నెల్లూరులోని స్వగృహంలో జరిగే జన్మదిన వేడుకలకు మండల వ్యాప్తంగా ఉన్న టిడిపి నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని చేజర్ల మండలం నాగులవెలటూరు కు చెందిన టిడిపి సీనియర్ నాయకులు వేలూరు కేశవచౌదరి కోరారు. 72వ జన్మదిన వేడుకల సందర్భంగా 72కేజీల భారీ కేక్‌ను కట్‌చేసి అనంతరం భారీ జగమాలతో ఆయన్ను ఘనంగా సత్కరిస్తామన్నారు. కావున మండలంలోని టిడిపి నాయకులు కార్యకర్తలు తరలి రావాలని ఆయన కోరారు.

## యువగళం వాలంటీర్లను సన్మానించిన బీద జ్యోతి



**బిట్రగుంట, జులై 9 ప్రభాతవార్త** టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ని యువగళం పాదయాత్రలో రేయింబవళ్లు కంటికి రెప్పలా రక్షణ కవచంగా చూసుకుంటున్న వాలంటీర్లను టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర సతీమణి బీద జ్యోతి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వాలంటీర్లకు బూట్లను, స్వెట్లను ఆమె అందజేసి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రవిచంద్ర కుమార్తె డాక్టర్ రిషిత, సీనియర్ టిడిపి నేత బీద గిరిధర్‌లు పాల్గొన్నారు.

## నారా లోకేష్‌కు 500 బోట్లతో భారీ స్వాగతం పలికిన మత్స్యకారులు



**కావలి రూరల్, జులై 9 ప్రభాతవార్త** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆదివారం సాయంత్రం కావలి రూరల్ మండలంలోకి యువగళం పాదయాత్ర ప్రవేశించడంతో అన్నగారిపాళెం పంచాయతీ వెంకటేశ్వరపురం వద్ద చిప్పలేరులో మత్స్యకారులు 500 బోట్లతో కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు ఆధ్వర్యంలో భారీ స్వాగతం పలికారు. ఈ భారీ స్వాగతానికి నారా లోకేష్ మత్స్యకారులను అభినందించారు. మాలేపాటి సుబ్బానాయుడు ఆధ్వర్యంలో నారా లోకేష్‌కు మేళతాళాలు, బాణాసంచా, పూలవర్షం కురిపిస్తూ స్వాగతం పలికారు. అన్నగారిపాళెం చేరుకున్న నారా లోకేష్‌బాబుకి అభిమానులు గజమాలతో సత్కరించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కావ్య ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర సతీమణి బీద జ్యోతి, కుమార్తె డాక్టర్ రిషిత, కావలి మండల టిడిపి అధ్యక్షులు ఆవుల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఉప్పాల వెంకట్రావు, నాయకులు సోమయ్యగారి రమణ, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.


## ప్రజలకు ఉపయోగపడే పని ఒక్కటైనా చేశావా జగన్

### శిలాఫలకాన్ని లోకేష్ చూపిస్తూ జగన్‌పై విమర్శలు



**కావలి, జులై 9 ప్రభాతవార్త** ప్రజలకు ఉపయోగపడే పని ఒక్కటైనా ఈ జగన్ చేశాడా అంటూ నారా లోకేష్ చిప్పలేరు వాగుపై నిర్మించిన శిలాఫలకాన్ని చూపిస్తూ విమర్శలు గుప్పించారు. మద్రాసు-కలకత్తా రహదారి నుంచి కావలి నియోజకవర్గం ఎస్వీపాళెం మీదుగా జువ్వలదిన్నె వెళ్లే రహదారిలో టిడిపి పాలనలో చిప్పలేరు వాగుపై నిర్మించిన వంతెనపై శిలాఫలకాన్ని ఆదివారం నారా లోకేష్ చూపిస్తూ విమర్శలు చేశారు. గత టిడిపి ప్రభుత్వ పాలనలో 25.30 కోట్లతో 2019 జనవరి 11వ తేది ఆనాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ బ్రిడ్జిని ప్రారంభించారన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుండి జగన్ దోచుకోవడం తప్ప ప్రజలకు ఉపయోగపడే ఇటువంటి ఒక్క పనినైనా ఈ జగన్‌రెడ్డి చేశాడా అని ఆయన దుయ్యబట్టారు. ఈ పాదయాత్రలో మత్స్యకార యువకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ఆమ్ ఆద్మి పార్టీ బలోపేతానికి కృషి



**వింజమూరు, జులై9ప్రభాతవార్త:** ఉదయగిరి నియోజకవర్గంలో గ్రామస్థాయి నుండి ఆమ్ ఆద్మి పార్టీని బ లోపేతం చేసేందుకు కృషి చేస్తానని ప్రముఖ న్యాయవాది ఆమ్ ఆద్మి పార్టీ ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండ్రు సుధాకర్ తెలిపారు. ఆదివారం వింజమూరులో ఆర్‌అండ్‌బి విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆమ్ ఆద్మిపార్టీ జిల్లా అధ్యక్షుడు టి.కె.సర్దార్, ఉపాధ్యక్షుడు ఉస్మాన్‌లు ఉదయగిరి నియోజకవర్గ ఆమ్ ఆద్మిపార్టీ బాధ్యతలను అప్పగించారన్నారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా పార్టీకోసం పనిచేస్తానన్నారు. గతంలో ఎమ్మార్పీఎస్, బిజెపి లో పనిచేసిన అనుభవంతో ఆమ్ ఆద్మి పార్టీని ఉదయగిరి నియోజకవర్గంలో ప్రధాన పార్టీలకు ధీటుగా పార్టీని తీసుకువస్తానన్నారు. ఈకార్యక్రమంలో బూదాల ప్రేమదాస్, శ్రీనివాసులు, ప్రసాద్ తదితరులున్నారు.